క్లుప్తంగా

నేత్ర శస్త్రచికిత్సకు 64 మంది ఎంపిక



వృద్ధుడి కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు జాక్సన్

బాడంగి: స్థానిక శివాలయం దగ్గరలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉచిత నేత్రవైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. బాడంగి, పిన్నవలస, పూడివలస, భీమవరం, డొంకినవలస తదితర ప్రాంతాల నుంచి 109 మంది కంటి రోగులు హాజరై, తమ కళ్ల ఆరోగ్యాన్ని పరీక్షించుకున్నారు. వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 64 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు క్యాంప్ ఇన్‌చార్జ్ వెంకటరమణ తెలిపారు. వీరందరినీ బస్సులో విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించామన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



పణుకువలసలో కాలువల్లోని పూడికలు తీస్తున్న కూలీలు

తెర్లాం: మండలంలోని పణుకువలస, సోమిదలవలస గ్రామాల్లో సర్పంచ్ చందక సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వర్షాకాలం కావడంతో నీరు నిల్వ ఉండిపోకుండా కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడికలు తొలగించారు. గ్రామస్తులు కూడా పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని, అనవసరంగా ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దని కోరారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటిస్తేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్ల: మండలంలోని గుర్ల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధి గ్రా మాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ డీఈ పి.హరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుజ్జింగివలస, గోషాడ, తెట్టంగి, పోలాయవలస, చుక్కపేట, చోడ వరం ,పెనుబర్తి, చింతపల్లిపేట, గంగిరెడ్లపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న శివాలయం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఆలయ అర్చకులు మేడపాటి కిశోర్‌శర్మ ప్రత్యేక పూజలు, హోమం, మండపారాధన చేశారు. సోమవారం అభిషేకాలు, అష్టోత్తరశతనామ పూజలు, శివపార్వతుల కల్యాణం జరిపించను న్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పరామర్శ

శృంగవరపుకోట: మండలంలోని పెదఖండేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఎర్రపాటి రమణమూర్తి ఇటీవల మరణించారు. ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆదివారం పరామర్శించారు. రమణమూర్తి మృతిపై సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు వాకాడ రాంబాబు, ఎర్రపాటి సూర్యనారాయణ, రంభ వెంకటరమణ, తదితరులు ఉన్నారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకాలు



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో అమ్మవారికి ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు. తెల్లవారు జామున 4 గంటల నుంచే అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం అమ్మవారిని భక్తుల దర్శనార్థం అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో దాతల సహకారంతో అమ్మవారి దేవస్థానంలో భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

ఊపందుకున్న ఖరీఫ్ పనులు



రొంపల్లిలో పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు



కోట-శిర్లాంలో మొక్కజొన్న పంటకు తారెలు తీస్తున్న రైతు కూలీలు



రామభద్రపురంలో ఉల్లి విత్తనాలు విత్తుతున్న మహిళా రైతులు

ఖరీఫ్ సాగు పనులు ఊపందుకున్నాయి. సకాలంలో తొలకరి వర్షాలు కూడా కురవడంతో అన్నదాతలు పొలంబాట పట్టారు. ఓ వైపు దుక్కి పనులు చేస్తూ మరోవైపు నేల సారవంతానికి నవధాన్యాలు చల్లుతున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఉన్న ఊరిలోనే విత్తనాలు, ఎరువులు లభిస్తుండడంతో వ్యవసాయం సులువైందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల వరి, మొక్కజొన్న పంటల విత్తనాలు వేయడంతో పాటు కూరగాయల సాగుకు సన్నద్ధమవడం గమనార్హం.

–రామభద్రపురం

ప్రకృతి సాగు.. లాభాలు బాగు..

వంగర: ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని, ప్రతీ రైతు ప్రకృతి సేద్యం వైపు పయనించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ ఆనందరావు అన్నారు. మండలంలోని కింజంగి, మరువాడ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానాలు–వాటి ప్రయోజనాలపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ప్రధాన పంట వేసుకునేముందు నవధాన్యాలు పొలాల్లో చల్లుకుని, మొక్కలైన తర్వాత వాటిని అదే నేలలో కలియదున్నాలన్నారు. అలా చేయడం ద్వారా నేల సారవంతమై పంటలు బాగా పండుతాయన్నారు. విత్తనాలు వేసే ముందు వాటిని బీజామృతంతో శుద్ధి చేసుకోవాలని, అలా అయితే చీడపీడలు, తెగుళ్ల పంటకు సోకకుండా ఉంటాయన్నారు.

ప్రకృతి సాగు పద్ధతులు అవలంబిస్తూ వ్యవసాయం చేస్తే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. అలాగే పంటకు పెట్టే పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్ఏలు రేఖ, వరప్రసాద్, యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు, ఐసీఆర్‌టీ పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



రాజాం: పాగిరిలో ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరిస్తూ పండిస్తున్న కూరగాయల పంట

రాజాం: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తూ పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం పాగిరి యూనిట్ ఎల్‌వన్ పి.రమాదేవి తెలిపారు. మండలంలోని పాగిరి గ్రామంలో కూరగాయలు సాగుచేసే రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానాలపై ఆదివారం అవగాహన కల్పించారు. తక్కువ కమతాల్లో పంటలు పండించి, అధిక లాభాలు పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో జీరో బడ్జెట్ వ్యవసాయం సాధ్యమని, ఆవుపేడ, గత్తం, కషాయాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. భూసారంపెరగడంతో పాటు ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు.



వంగర: రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ ఆనందరావు

భగవన్నామస్మరణతోనే మోక్షం



ఆధ్యాత్మిక ప్రసంగం ఇస్తున్న వక్తలు

రేగిడి: భగవన్నామస్మరణతోనే మోక్షం లభిస్తుందని ఆధ్యాత్మిక వక్తలు జడ్డు జగ్గారావు, రామశేషు అన్నారు. స్థానిక దత్తపీఠంలో ఆధ్యాత్మిక జ్ఞానబోధ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవంతుడి నామాన్ని నిత్యం స్మరిస్తే సకల పాపాలు తొలగి, దుఃఖాలు దరిచేరవన్నారు. మనిషిని తరింపచేసేది తారకమంత్రమని, ప్రతిఒక్కరూ భగవంతుడిని ఆరాధించాలని తెలిపారు. ఒక్కరు భగవంతుని నామాన్ని భక్తి శ్రద్ధలతో స్మరణ చేస్తే ముక్తిని పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యంనాయుడు, దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టారు, పండిత నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ప్రధానోపాధ్యాయురాలు హైమావతి తదితరులు

రాజాం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బొద్దాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హైమావతి అన్నారు. ఆదివారం అదే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి అందించిన మొక్కలను విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో ఆమె నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, పరిరక్షించాలని కోరారు. రాజాం గ్రీనరీకి వెయ్యి మొక్కలు నాటడమే లక్ష్యంగా రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి కృషి చేస్తోందని, వారి సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాజాం పర్యావరణ పరిరక్షణ కమిటీ కన్వీనర్ నాయుడు పాల్గొన్నారు.

విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి



వన్నలిలో రైతుల పేర్లు నమోదు చేస్తున్న వీఏఏ శ్రీనివాసరావు

రేగిడి: ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులంతా విత్తనాల కోసం పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మండలంలోని వన్నలి, వండానపేట, చాటాయివలస, అక్కన్నఅగ్రహారం, రేగిడి, ఉనుకూరు, బూరాడ, శిర్లాం గ్రామాల్లో విత్తనాలు కావాలనుకునే రైతుల పేర్లను వ్యవసాయ సిబ్బంది ఆదివారం రిజిస్ట్రేషన్ చేశారు. పేర్లు నమోదు చేసుకుంటే ఎంతమేర విత్తనాలు తెప్పించాలన్న అంచనా తమకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. లైసెన్స్‌లు లేని షాపుల్లో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి, మోసపోవద్దని తెలిపారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ మరమ్మతులు



కొత్తగా విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సంతకవిటి: మండలంలో విద్యుత్ మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. శనివారం గాలివాన సృష్టించిన బీభత్సానికి చాలా గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలు విరిగిపడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అప్రమత్తమైన విద్యుత్‌శాఖ సిబ్బంది విద్యుత్ వైర్లపై పడిన చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు పడిపోయిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. దీంతో శనివారం అర్ధరాత్రి నాటికే కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాగా మరికొన్ని గ్రామీణ ప్రాంతాలకు ఆదివారం విద్యుత్ సరఫరాకు మార్గం సుగమమైంది. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ సయ్యద్, జూనియర్ లైన్‌మన్‌లు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన



రేగిడి: నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



బొబ్బిలి రూరల్: నవధాన్యాల సాగు ప్రయోజనాలను వివరిస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో నవధాన్యాల సాగుపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్పీ పైల తవిటినాయుడు నవధాన్యాల సాగు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రధాన పంట సాగుకు ముందు పొలాల్లో నవధాన్యాలు చల్లుకోవాలని, అవి మొక్కలైన తర్వాత అదే నేలలో కలియదున్నితే ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు నేల నుంచే లభిస్తాయన్నారు. దీంతో ఆరోగ్యవంతమైన పంట అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటిపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రంలో నవధాన్యాల సాగు–వాటి ప్రయోజనాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రధాన పంట విత్తనాలు వేసుకునే ముందే నేలలో నవధాన్యాలు చల్లుకుని, మొక్కలైన తర్వాత కలియదున్నాలన్నారు. తద్వారా నేల సారవంతమై ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు నేల ద్వారా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ పి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నారుమడులు సిద్ధం చేసుకోండి

బాడంగి: ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించిన రైతులంతా నారుమడులు సిద్ధం చేసుకోవాలని ఏవో కె.శిరీష తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పరికరాలు, పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయడాన్ని పరిశీలించిన ఆమె.. ఎకరా పంట పొలంలో 10 సెంట్ల స్థలంలో నారుమడి తయారు చేసుకోవాలన్నారు. నేలను శుభ్రంగా దుక్కి చేసి, దదును చేసుకోవాలన్నారు. ఆ తర్వాత ఆ నేలలో పశువుల గెత్తంతో గానీ గొర్రెలు, మేకల మంద గెత్తంతో గానీ వేసి, సారవంతం చేసుకోవాలన్నారు. అలా చేసిన నేలలో అదును చూసి, నారు పెంచుకోవాలన్నారు. అయితే నార్లు వేసేముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. విత్తనాలను శుద్ధి చేసుకుని, నాటుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులకు ఆస్కారం ఉంటుందన్నారు.

శిశుమందిర్‌లో పోస్టుల భర్తీ

బొబ్బిలి: స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో బోధకుల నియామకానికి ఆదివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మాతాజీ, ఆచార్యుల పోస్టుల భర్తీ కోసం చేపట్టిన ఈ ఇంటర్వ్యూలకు 16 మండలాల నుంచి ఔత్సాహికులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. ఇంటర్వ్యూలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి అవకాశం కల్పిస్తున్నామన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

బొండపల్లి: రోజూ ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా శిక్షకులు భీమనేని వంశీకిరణ్ అన్నారు. గొట్లాం గ్రామంలోని ఫిరమిడ్ సేవాదళ్ ఆశ్రమంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఆదివారం నిర్విరామ ధ్యానం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వంశీకిరణ్ ధ్యానం ఆవశ్యకతను వివరించారు. నేటి ఆధునిక యుగంలో అన్ని రంగాల్లోని వారు తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటూ రోగాల పాలవుతున్నారని అన్నారు. మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందు కు ధ్యానం ఒక్కటే మార్గమని చెప్పారు. ప్రతి ఒక్కరూ యోగా,ధ్యానం చేయాలని చెప్పారు. ఫిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వినర్ వి.రామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు క్యాన్సర్ నిర్ధారణ వైద్యశిబిరం

శృంగవరపుకోట: రాజీపేట వద్ద ఉన్న శంబలనగరిలో గాయత్రీ దేవి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం సత్యసాయి ట్రస్ట్ నేతృత్వంలో క్యాన్సర్ నిర్ధారణ ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గాయత్రీ దేవి జయంతి సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడమంటే మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి, పుస్తకాలు ఏవిధంగా చదవాలో నేర్పించారు. అనంతరం కథలు చెప్పడం, రాయడం, బొమ్మలు వేయడం వంటివి నేర్పించారు. పుస్తకాలు చదవడం ద్వారా అపారమైన జ్ఞానం కలుగుతుందని, ప్రతీ విద్యార్థి పుస్తకాలు చదివేందుకు ఆసక్తి కనబరచాలన్నారు.

కళాశాల మంజూరుపై ధన్యవాద తీర్మానం

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జామికి జూనియర్ కళాశాల మంజూరు
- మండల సర్వసభ్య సమావేశంలో ధన్యవాదాలు తెలిపిన సభ్యులు
- సర్పంచ్‌లు ప్రొటోకాల్‌ను అధికారులు తుంగలో తొక్కుతున్నారని ధ్వజం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సబ్బవరపు అరుణ

జామి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మండల కేంద్రం జామిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయడంపై మండల పరిషత్ సభ్యులు ధన్యవాదాలు తెలుపుతూ ఏక గ్రీవ తీర్మానం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ అధ్యక్షతన ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకూడదని చింతాడ సర్పంచ్ ఏ.సుబ్రహ్మణ్యం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులు ఏకగ్రీవం గా ఆమోదించారు. అనంతరం చింతాడ, విజినిగిరి సర్పంచ్‌లు సుబ్రహ్మణ్యం, సూర్యారావు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కొందరు అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడం ప్రారంభించారని, గ్రామాల్లో రైతులకు వరి విత్తనాల పంపిణీ చేసే కార్యక్రమాల్లో సంబంధిత అధికా రులు సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వకుండా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పంపిణీ చేయిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని అధికారులే అపహాస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జామి జూనియర్ కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్లకు సంబంధించి నిర్వహించిన సమావేశంలో టీడీపీ నేతలతో జామి హైస్కూల్‌లో సమావేశం నిర్వహించారని, మండలంలోని సర్పంచ్‌లకు కాని, ఎంపీపీ, జెడ్పీటీసీకి కాని ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, ఇది అధికారుల అత్యుత్సాహం కాదా అని ధ్వజమెత్తారు.

అధికారులు రాజకీయాలు చేయడం తగదు

జెడ్పీటీసీ గొర్లె సరయు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఒక పార్టీనేతలతో సమావేశం నిర్వహించడం చట్ట విరుద్ధమని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో జామికి జూని యర్ కళాశాల మంజూరైందని, ఇది పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. అలాంటి కళాశాల విషయంలో అధికారులే రాజకీయాలు చేయడం తగదన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులను అధికారులు ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించారు. కళాశాల విషయంలో రాజకీయాలు చేస్తే ఆ చర్యలు కళా శాల అభివృద్ధికి ఆటంకంగా మారే ప్రమా దం ఉందని అన్నారు. వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు మాట్లాడు తూ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణాల్లో భాగంగా అలమండ,జామి గ్రామాల్లో శ్మశాన వాటికలు లేకుండా పోయాయని, శ్మశాన వాటికల పునరుద్ధ రణకు సంబంధిత అధికారులు స్థలాలు కేటాయించి సమస్య పరిష్కరించాలని కోరారు. భీమసింగి ఎంపీటీసీ ధనియాల హైమావతి మాట్లాడుతూ చెరువుల్లో మట్టిని కొంతమంది అక్రమంగా ఇటుక బట్టీ ల నిర్వాహకుకు అమ్మకాలు చేస్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ రాంబాయి స్పందిస్తూ అక్రమ మట్టితవ్వకాల విషయం తమ దృష్టికి వచ్చిందని దీనిపై విచారణ చేయిస్తున్నామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలో 20 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, సర్వేకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా దరఖాస్తు చేసుకుంటే పరిష్కరిస్తామని తహసీల్దార్ చెప్పారు. వైస్ ఎంపీపీలు జి.వెంకటరావు,ఎన్నింటి ఆదిలక్ష్మి, ఎంపీడీఓ తిరుమలరావు,హౌసింగ్ ఏఈ వెంకటరావు, పీఆర్ డీఈ స్వామినాయుడు, వైద్యాధికారి పద్మావతి, ఏపీఓ కిరణ్మయి, ఇరిగేషన్ షేఈ కృష్ణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఆర్.రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

చీపురుపల్లి: మండలంలోని కర్లాం రైతుభరోసా కేంద్రంలో చీపురుపల్లి సబ్ డివిజన్ ఏడీఏ ఎస్.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్లాం రైతుభరోసా కేంద్రంలో ఎంటీయూ–1121 రకం వరి విత్తనాలు 1155 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.